ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 30 మార్చి 2025 | 7







ఉగాది.. ఈ ఏడాది!

అమలాపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సుఖదుఃఖాల కలయికే జీవితం...మంచి చెడుల కలయికే ఓ కొత్త సంవత్సరం. కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో అడుగిడాలని అందరి ఆకాంక్ష. విశ్వావసు నామ సంవత్సరంలో కొన్ని రంగాల్లో మంచి జరిగితే.. మరికొన్ని రంగాలకు చెడు జరుగుతుందని పంచాంగకర్తలు చెబుతున్నారు. సర్వేజనా సుఖినోభవంతు అని పలికే పంచాంగకర్తలు గ్రహస్థితులను లెక్కలు కట్టి కొవిడ్ తరహాలో ఈ ఏడాది ఏదైనా విపత్తు వచ్చే అవకాశం ఉందంటున్నారు. షష్ఠగ్రహ కూటమి, కాలసర్పయోగం, పంచగ్రహ కూటమితోపాటు గురుడు ఏడాదికి ఓ రాశి చొప్పున మారాల్సి ఉండగా విశ్వావసు నామ సంవత్సరంలో మూడు రాశుల్లో సంచారం చేయడం వల్లే ఈ తరహా పరిస్థితులు తప్పవంటున్నారు. మీన రాశిలో షష్ఠగ్రహ కూటమిలో భాగంగా సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు, శని, రాహువు సంయోగం చెందడం వల్ల ఆ ప్రభావం ద్వాదశ రాశుల వారిపై మూడు నెలలు ప్రభావం చూపుతుంది. దానికితోడు జులై 27 వరకు కాలసర్ప యోగం ఏర్పడడంతోపాటు మార్చి 31 నుంచి ఏప్రిల్ 13 వరకు పంచగ్రహ కూటమి వల్ల మండే ఎండలు, వేసవి తీవ్రత, అకాల మరణాలు తప్పవంటున్నారు. అనారోగ్యాలు, యుద్ధభూమి ఆందోళనకర పరిస్థితులు ఉంటాయంటున్నారు. అదేవిధంగా పలు రంగాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతుందని వివరిస్తున్నారు.

చల్లంగచూడు.. నూకాంబికా!

చింతలూరు ఈ పేరు సుపరిచితమే.. గోదావరి జిల్లాల్లో ఇక్కడ వెలసిన అమ్మవారు సుపరిచితమే.. చింతలూరు నూకాంబికగా భక్తజనం కొలుస్తారు.. అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి.. చల్లంగ చూసే దేవతగా భక్తజనం అమ్మవారిని చూస్తారు.. పిల్లలపై అమ్మవారు రాకుండా ఉండాలంటే ఇక్కడ కాగడాలు వేయించాలనేది భక్తుల నమ్మకం.. ప్రతి ఏడాది ఉగాది ముందు రోజు నుంచి ఉత్సవాలు ఆరంభమవుతాయి. నెలరోజులపాటు నిరాటంకంగా జరుగుతాయి.. శనివారం లక్షలాదిగా భక్తజనం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - ఆలమూరు



రామన్నది.. జపూజ్యమే!

ఇక నుంచి ఉగాది ఉషస్సులే..

- (కాకినాడ/అమలాపురం / రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

కూటమిపై జనం విశ్వాసం ఉంచారు.. చంద్రబాబును సీఎంను చూస్తే ఏపీ దిశ.. దిశ మారుతుందని నమ్మారు.. సూపర్ 6 హామీలను చూసి మురిసిపోయారు.. ఇంకేంటి గత సార్వత్రిక ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విజయాన్నదించారు.. రాష్ట్రవ్యాప్తంగా 175 స్థానాలు ఉంటే 164 స్థానాల్లో కూటమిని గెలిపించారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అయితే క్లీన్‌స్వీప్ చేశారు.. మరి ఆ విశ్వాసాన్ని కూటమి నిలబెట్టుకుంటుందా అంటే.. జనం ఓటేసి విశ్వాసాన్ని చూపితే.. చంద్రబాబు ప్రభుత్వం కూడా విశ్వావసు నామ సంవత్సరంలో సూపర్ 6 హామీల అమలుపై దృష్టిపెట్టింది.. మరో రెండు నెలల్లోనే తల్లికి వందనం.. అన్నదాతా సుఖీభవ తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయనుంది..



ఉందిలే మంచీ కాలం ముందు ముందునా.. అందరూ సుఖపడాలి.. ఈ రాష్ట్రమునందునా.. అన్నట్టుగానే.. ఆ మంచి కాలం రానుంది. తెలుగు సంవత్సరాది ఉగాది వేళ.. కోటి ఉషస్సుల కొత్త కాంతిలో సామాన్యుల జీవితాలు కొత్త వెలుగును సంతరించుకోనున్నాయి. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం తీసుకొసున్న పథకాలు ప్రజలకు భరోసాగా నిలవనున్నాయి. సర్కారు చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమాలతో సామాన్యుడి బతుకు చిత్రం మారనుంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇప్పటికే కొత్త పింఛన్లు, సదరం సర్టిఫికెట్ల జారీ, కొత్త రేషన్ కార్డుల సమాచారం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు ప్రక్రియ, బీసీ రుణాలు, మహిళలకు కుట్టుమెషీన్లు, మే నెలలో తల్లికి వందనం, జూన్‌లో అన్నదాతా సుఖీభవ వంటి పథకాలను ప్రజలకు అందించనుంది.

తల్లికి వందన..మే



మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకాన్ని సీఎం నారా చంద్రబాబు ఎన్నికల హామీగా ఇచ్చారు. ఈ పథకంలో ఒకొక్క విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎంత మంది ఉంటే అంత మందికి అందించనున్నారు. కాకినాడ జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 3,10,003 లక్షల మంది ఉండగా 1,87,671 మంది తల్లులు ఉన్నారు. కోనసీమ జిల్లాలో 2.25 లక్షల మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2.48 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

మహిళలకు కుట్టు మెషీన్లు..

మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి వారికి మెషీన్లు పంపిణీ చేసేందుకు కూడా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. 18 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులు. నియోజకవర్గానికి మూడు వేల మెషీన్లు అంద నున్నాయి. 45, 60, 90 రోజుల శిక్షణ పూర్తయిన అనంతరం వీటిని లబ్ధిదారులకు అందజేస్తారు. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే 3243 మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది.

అన్నదాతా సుఖీభవ..



కూటమి ప్రభుత్వం రైతుల్లో భరోసా నింపే అనేక కార్యక్రమాలు చేపడుతోంది. త్వరలోనే అన్నదాతా సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టనుంది. రైతన్నలకు అండగా నిలిచేలా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించనుంది. రానున్న మే, జూన్ నెలల్లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాలో ఉన్న పీఎం కిసాన్ పథకం కింద 1.12 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య దాదాపు 1.20 లక్షలకు చేరుకోనుంది. కాకినాడ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఆనందమనిపింఛెన్..



దివ్యాంగులకు కొత్త పింఛన్లు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.జిల్లా ఆసుపత్రుల్లో దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. నెలలో మొదటి మంగళవారం జిల్లాలోని ఏరియా ఆసుపత్రిలో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు అందజేసి లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది. ఎమ్మెల్సీ కోడ్ కారణంగా నిలిచిపోయిన స్పౌజ్ పెన్షన్లను ఏప్రిల్ నెల నుంచి పంపిణీ చేయడానికి నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్ర త పింఛన్లు ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు.కాకినాడ జిల్లాలో 2,71,039 మంది పింఛనుదారులకు రూ.116.89 కోట్లు,తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 2,35,076 మంది లబ్ధిదారులకు రూ.102.28 కోట్లు, కోన సీమ జిల్లాలో 2,35,887 మంది లబ్ధిదారులకు రూ.100.90 కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు.వీటితో పాటు మే నెలలో కొత్తగా పెన్షన్లు విడుదల చేయనున్నారు.



'గృహ'త్తర పథకం..

పేదింటి కల తీరుస్తున్నారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు పీఎం ఆవాస్‌యోజన, అర్బన్ పథకాల కింద రుణాలు మంజూరు చేస్తున్నారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే ఇప్పటివరకు స్థలం ఉండి ఇళ్ల నిర్మించుకునే అర్హులను 12,213 మందిగా గుర్తించారు. వీరిలో అముడా, రుడా పరిధిలో 11,134 మంది అర్బన్ పరిధిలో 484 మంది, గ్రామాల్లో 595 మందిని అర్హులుగా గుర్తించారు. కాకినాడ జిల్లాలో సొంత స్థలాలు ఉండి ఇళ్ల కోసం 19500 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1800 మంది వివిధ మునిసిపాలిటీల పరిధిలో దరఖాస్తు చేశారు. కాకినాడ నగరంలో 945 ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ 15 వేల వరకూ దరఖాస్తులు అందినట్టు సమాచారం. అర్బన్ పరిధిలో గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు, గ్రామీణ లబ్ధిదారులకురూ.1.80 లక్షలు రుణాలుగా అందజేస్తారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు అదనపు సాయం అందిస్తుంది.

అభివృద్ధి.. డ్వాక్రా

ఒకప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలోనే ఊపిరి పోసుకున్న డ్వాక్రా సంఘాలు ఇప్పుడు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. డ్వాక్రా మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 18 వేల మంది ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. వీళ్లకు ఒక యాప్‌ని ఇస్తారు. దానిలో డ్వాక్రా సంఘంలోని మహిళల పూర్తి వివరాలను నమోదు చేస్తారు. డ్వాక్రా రు ణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకునే దిశగా ప్రోత్సహించి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తారు. జిల్లాలోని 3200 మహిళా సంఘాల్లోని 3.10 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.



రుణాల జాతర..

రుణాల జాతర మొదలైంది. ఈ నెల 11న కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఈనెల 25తో గడువు ముగిసింది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు. బీసీ ఉపకులాలు, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు కులాలు స్వశక్తితో ఆర్థికంగా బలపడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1,275 యూనిట్ల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.12. 26 కోట్లు సబ్సిడీతోపాటు రూ.12.26 కోట్లు రుణంగా అందిస్తారు. మిగిలిన కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.



ప్రజలకు మంత్రి, కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసారు. షడ్రుచుల కలయికతో కూడిన ఉగాది పచ్చడిలా ఈ ఏడాది అన్ని రుచుల మేళవింపుతో ఆనందంగా గడపాలన్నారు. శ్రీ విశ్వావసునామ సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని కోరారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థినీ విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం సంక్షేమశాఖల అధికారులతో సమీక్షించారు. సామాజిక బాధ్యత కింద కంపెనీలు, వ్యక్తుల నుంచి సేకరించే నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం నాటికి హాస్టళ్ల, పాఠశాలలను హేతుబద్ధీకరణ విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్‌వాల్ నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల ఆయా కార్యక్రమాల అమలు విషయంలో జిల్లా పరిధిలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి బాధ్యత వహించాల న్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ రాత్రి 11.42 గంటలకు
ఏం జరిగింది!
పాస్టర్ మృతిపై దర్యాప్తు ముమ్మరం 9



రఘునాథ శర్మ | డా.దంటు మురళీకృష్ణ | అరిపిరాల నారాయణరావు | బులుసు అపర్ణ | తాతా సందీప్ శర్మ | నల్లమిల్లి సుబ్బారెడ్డి | రవి పరస

ఏడుగురికి ఉగాది పురస్కారాలు

రాజమహేంద్రవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో జిల్లా నుంచి ఇద్దరు కళారత్న, ఐదుగురు ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు.ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సాహిత్యంలో రాజమహేంద్రవరానికి చెందిన ఆచార్య శలాక రఘునాథ శర్మ, డా.దంటు మురళీ కృష్ణ (సంస్కృతం)కు కళారత్న, సాహిత్యంలో రాజమహేంద్రవరానికి చెందిన డా.అరిపిరాల నారాయణరావు, అవధాన విభాగం నుంచి బులుసు అపర్ణ, తాతా సందీప్ శర్మ, సామాజిక సేవలో అనపర్తికి చెందిన నల్లమిల్లి సుబ్బారెడ్డి, రాజమహేంద్రవరానికి చెందిన అంతర్జాతీయ ప్రముఖ నఖ చిత్రకారుడు డాక్టర రవి పరసకు ఉగాది పురస్కారాలు దక్కాయి. విజయవాడలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి ఉగాది వేడుకల్లో పురస్కారాలు అందుకుంటారు.

నేడు ఎంపీ కార్యాలయంలో ఉగాది ఉత్సవం



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం జరగనుంది.ఈ మేరకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఎస్‌వీ ఫంక్షన్ హాలులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు దైవజ్ఞరత్న, వాస్తు జ్యోతిష్య ప్రవీణ పుల్లెల సత్యానారాయణచే పంచాంగ శ్రవణం ఉంటుంది. అనంతరం వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేయడం జరుగుతుందని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలు హాజరుకావాలన్నారు.



జై..టీడీపీ

రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే వాసు నివాళులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు.. కార్యకర్తలు.. అభిమానులు హాజరై పండుగల చేసుకున్నారు. అన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఎక్కడికక్కడ టీడీపీ జెండాలను ఎగురవేశారు.. జై ఎన్టీఆర్.. జై టీడీపీ.. జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు.. - వివరాలు 10లో



ఇఫ్తార్ విందు

మనం మనం ఒకటే.. హిందూ ముస్లిం బాయిబాయి.. అదే మన నినాదం.. అలాగే కలిసుందాం.. ఆనందాలను పంచుకుందాం అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్‌రీజెన్సీ పందిరి ఫంక్షన్‌హాలులో శనివారం సాయంత్రం ముస్లింలకు ఆత్మీయ ఇఫ్తార్ విందు ఇచ్చారు. - రాజమహేంద్రవరం అర్బన్

ఆరుగురు పిల్లలు దొరికారు..
అధిక వడ్డీ ఆశ.. రూ.30 లక్షలు స్వాహా
ఆలయాలే.. టార్గెట్ 9

లాభాల బాట పట్టించండి!



ఇదేదో ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్‌లా ఉందే అనుకుంటే పొరబడినట్టే.. ఈ బస్‌లో ఉన్నది ఆర్టీసీ సిబ్బందే.. బస్‌లో ఎక్కడికి వెళుతున్నారంటారా.. ట్రయల్‌కి.. మరీ ఆమె ఎందుకంటారా..! ఆమె కదా చూడాల్సింది.. ఎందుకంటే ఆమె ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల ఆశోక.. నిడదవోలు డిపోలో బస్‌లు చూస్తే అన్నీ పాతవే.. ఒక్కటీ కొత్తది కనిపించదు.. దీంతో నిత్యం మరమ్మతులే.. డిపోలో ఆదాయం తక్కువ.. పెట్టుబడి ఎక్కువ.. ఎందుకిలా జరుగుతుందో తెలుసుకోవాలని శనివారం ఇలా నిడదవోలు డిపోను పరిశీలించారు.. ఎక్కడ లోపం ఉందో తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని.. డిపోను లాభాల బాటలో ఉంచాలని ఆదేశించారు. - నిడదవోలు



ఉగాదికి పల్లెలు, పట్టణాలు ముస్తాబు

కరప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ తెలుగు సంవత్సరాదికి పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. ప్రజలు తమ ఇళ్లల్లో ఉగాది వేడుకను శోభాయమానంగా నిర్వహించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉగాది రోజున షడ్రుచుల మేళవింపుతో చేసుకునే వేప పువ్వు పచ్చడికి విశిష్ట స్థానం ఉంది. రైతులు, యువకులు సమీప తోటలు, పొలాల గట్లకు వెళ్లి పచ్చడికి ప్రధానమైన వేపపువ్వును సేకరించారు. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఉగాది వేడుకలకు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలుచోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి.

సర్వేజనా సుఖినోభవంతు

మంచి చెడుల కలయికే విశ్వావసు నామ సంవత్సరం.... ఇదీ పంచాంగకర్తల మాట



రవి రాజైనందున...

కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, ఈశ్వర పంచాంగకర్త, బండారులంక

విశ్వావసు నామ సంవత్సరానికి రవి రాజైనందున రాజకీయ కల్లోలాలు ఉంటాయి. చంద్రుడు మంత్రి అయినందున వర్షాలు, పంటలు బాగుంటాయి. సేనాధిపతి శని కావడం వల్ల ప్రజలు అనేక రకాలభయాందోళనలతో జీవించాల్సి వస్తుంది. దేవదాయ, ధర్మాదాయ శాఖ పనితీరు మెరుగుపడడంతో పాటు నూతన వైష్ణవ ఆలయాల నిర్మాణాలుజరుగుతాయి. వస్త్ర పరిశ్రమ నూతన ఫ్యాషన్ డిజైన్లతో అభివృద్ధి చెందుతుంది. చేనేత రంగం కూడా అభివృద్ధిలో పయనిస్తుంది. పంచాయతీరాజ్, పురపాలక, గృహ నిర్మాణశాఖలు ఎంతో పురోభివృద్ధిలో నడుస్తాయి. నూతన రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ గృహ నిర్మాణాలు వేగవంతమవుతాయి.

(అమలాపురం రూరల్, ఆంధ్రజ్యోతి)

వైజ్ఞానిక రంగంలో పురోగతి



ఉపద్రష్ట నాగాదిత్యన్, పంచాంగకర్త, అమలాపురం

పంచమాధిపతి గురుడు అయినందున వైజ్ఞానిక రంగంలో నూతన ప్రయోగాలు విజయవంతమవుతాయి. సినీ పరిశ్రమ, క్రీడా రంగం ఎంతో అభివృద్ధి చెందుతాయి. సప్తమంలో శని స్వక్షేత్ర స్థితిలో ఉండడంతో పోలీసు, రక్షణ శాఖలు ఎంతో మెరుగ్గా పని చేస్తాయి. దేశ సంరక్షణలో పటిష్టమైన నిర్ణయాలు తీసుకుంటారు. గురుడు అతి చరాగతి కలిగి ఉన్న తీరు 2020లో వచ్చిన కొవిడ్ ఉగ్ర రూపాన్ని మరోసారి చూపిస్తుంది. అది ఏ రకంగా వస్తుందో చెప్పలేం. ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బంగారం, బ్యాంకింగ్ వ్యవస్థలు సక్రమంగా పనిచేయవు.

బిల్ కలెక్టర్లకి, రికార్డు అసిస్టెంట్లకు ఊరట

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, రికార్డు అసిస్టెంట్లు వున్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చాక కొంతమంది సీనియర్లు ఉండాలన్న ఉద్దేశ్యంతో వారిని సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీలుగా నియమించారు. అంతవరకు బాగానే ఉన్నా వారికి అసలు సమస్య అక్కడే వచ్చింది. ఎందుకంటే సచివాలయ వ్యవస్థలో పదోన్నతులపై ఎటువంటి దిశానిర్దేశం లేకుండా ఉండడంతో మున్సిపాల్టీ నుంచి వచ్చిన వారు ఆ చట్రంలో ఇరుక్కుపోయారు. ఇది గమనించిన వారంతా వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా 2023 అక్టోబరు 25న డీఎంఏకి వినతిపత్రం అందజేశారు. తమకు యథావిధిగా

పదోన్నతులపై ప్రభుత్వానికి సిఫారసు చేసిన డీఎంఏ

పదోన్నతి కల్పించాలని వేడుకున్నారు. సానుకూలంగా స్పందించిన డీఎంఏ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ ఈ నెల 25న లేఖ రాశారు. గతంలో వారికి పదోన్నతులకు ఏ విధమైన మార్గం ఉందో ఆ రకంగా... బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న వారికి జూనియర్ అసిస్టెంట్లుగాను, రికార్డు అసిస్టెంట్లుగాను అర్హతను బట్టి డిగ్రీ, బీకాం కోర్సు చేసిన వారికి సర్వీసు రూల్స్‌కి లోబడి అవకాశం కల్పించాలని ఆ లేఖలో కోరారు. దీనిపై రాష్ట్ర మున్సిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, బిల్ కలెక్టర్లు, రికార్డు అసిస్టెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూది రంధ్రంలో అతిసూక్ష్మంగా టీడీపీ సింబల్



కార్పొరేషన్(కాకినాడ), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన సూక్ష్మ కళా ఖండాల నిపుణుడు ఆరిపాక రమేష్ బాబు సూది రంధ్రంలో ఇమిడేలా అతి సూక్ష్మ తెలుగుదేశం పార్టీ సింబల్‌ను 22క్యారెట్ బంగారంతో తయారుచేశారు. ఈ సింబల్‌ను సూర్యడు, నాగలి, ఇల్లు మూడు విడి భాగాలుగా తయారుచేసి సూది రంధ్రంలో అమర్చారు. ఈ కళాఖండాన్ని రూపొందిచండానికి నెల రోజులు సమయం పట్టిందని దీని బరువు సుమారు 30 మిల్లీ గ్రాములు ఉండవచ్చన్నారు. ఈ కళాఖండాన్ని సీఎం చంద్రబాబు, పార్టీ నేతలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడానికి తయారుచేశానన్నారు. మైక్రోస్కోప్‌లో మాత్రమే కనిపించే ఈ అద్భుత కళాఖండాన్ని సీఎం చంద్రబాబుకు బహుకరిస్తానని రమేష్ తెలిపారు.

భక్తవత్సల గోవిందా!

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఆదాయం రూ.40.64లక్షలు



ఆత్రేయపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.40.64 లక్షలు వచ్చినట్టు ఉప కమిషనరు తెలిపారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన అభయ అంజనేయ కోలాట నృత ప్రద ర్శ న ఆ ల రి ం చింది.

మహిళకు గాయాలు

ఆలయం వద్ద దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక భక్తురాలు గాయపడ్డారు. రాయవరం మండలం వెంటూరుకు చెందిన ఎం.పద్మ శనివారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయం ఎదురుగా దీపారాధన మండపం వద్ద ఆమె దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని చేతులు, కాళ్లు, శరీర భాగాలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న 104 అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆలయ ఈవో, ఉపకమిషనరు సూర్యచక్రధరరావు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్లారు.మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. సూపరింటెండెంట్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.





కాకినాడలో వేప పువ్వు, మామిడాకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కిటకిటలాడిన మార్కెట్లు



కాకినాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా కాకినాడ నగరంలోని మార్కెట్లు కిటకిటలాడాయి. వేప పువ్వు, పూజా సామగ్రి కొనుగోలుకు జనం భారీగా తరలివచ్చారు. పెద్ద మార్కెట్, చిన్న మార్కెట్, గాంధీనగర్, జగన్నాథపురం ప్రాంతాల్లో సందడి నెలకొంది. మరోవైపు నూకాలమ్మ తల్లి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి టూటౌన్ నూకాలమ్మ గుడి, పెద్ద మార్కెట్ నూకాలమ్మ తల్లి, డెయిరీఫారమ్ నూకాలమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్లు మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల భారీ సెట్టింగ్‌లతో ఆలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. భక్తులు బారులు తీరి అమ్మవార్లను దర్శించుకున్నారు.

పచ్చిమామిడి... కేరాఫ్ బెండపూడి



- ఇతర రాష్ట్రాల్లో భారీగా వినియోగం
- బెండపూడి నుంచి ఏటా వందల టన్నుల ఎగుమతులు

తొండంగి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి కేంద్రంగా పచ్చిమామిడి ఎగుమతులు ఊపందుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాం తాలతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో పచ్చడి, చట్నీల్లో పచ్చిమామిడి కాయలను విరివిగా వినియోగిస్తారు. దీంతో బెండపూడి రైతులు కటక్, భువనేశ్వర్, కోల్‌కతా తదితర ప్రాంతలకు ఏటా వందల టన్నుల కాయలను ఎగుమతి చేస్తున్నారు. పరిసర గ్రామాల్లో పచ్చిగా వినియోగించేందుకు అనువైన తోతాపురి, విమాన పసందు, దేశవాళితో పాటు స్థానికంగా మరికొన్ని రకాలు అనువుగా ఉన్నాయి. ఈ ఏడాది చీడపీడల కారణంగా మామిడి ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో పాటు ధర క్రమేపీ దిగజారింది. దీంతో స్థానిక వ్యాపారులు, రైతులు గిట్టుబాటు ధర లభించక ఇబ్బందిపడుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణకు పచ్చిమామిడిగా అమ్మకాలు

గాలి, వానల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులు పచ్చిమామిడి అమ్మకాలను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. కాయలు పక్వానికి వచ్చే వరకు ఆగితే గాలి,వాన వల్ల మొత్తం కాయ రాలిపోయి తీవ్ర నష్టం మిగిలేది. దీని నుంచి బయటపడేందుకు ముందుగానే ఫిబ్రవరి నెల నుంచి కాయలను దింపి ఎగుమతి చేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో కిలో రూ.75-80 ఉండగా నేడు అది 20 రూపాయలకు దిగజారింది. కాయల సైజు పెరగడంతో ఈధర కూడా కొంతలో కొంతమేలు చేసే అవకాశం ఉంది. స్థానికంగా మామిడి ఉత్పత్తులు చీడపీడలు కారణంగా తగ్గాయి. అయినప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి ఎక్కువగా ఉండడంతో ధర పెరగలేదని స్థానికులు చెప్తున్నారు ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చికాయల ఎగుమతి జరగుతుంది. అప్పటికి తోటల్లో సగం కాయలను ఒబ్బిడి చేసుకుంటారు. మే నెలలో తుఫాన్లు సంభవించినా రైతుల పెట్టుబడికి ఢోకా ఉండదు. పండ్ల వరకు



పచ్చిమామిడిని లారీలో ఎగుమతి చేస్తున్న దృశ్యం



ఉంచితే వచ్చే లాభం కంటే పచ్చిమామిడి అమ్మకాల వలన నష్టమే అయినప్పటికీ పూర్తిగా నష్టపోకుండా కొంత వెసులుబాటు ఉంటుందని రైతులు చెప్తున్నారు.

ఉగాదికి ఇక్కడి నుంచే...

ఉగాది పచ్చడిలో వినియోగించేందుకు బెండపూడి నుంచి పచ్చిమామిడి వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లకు చేరుతుంది. ఇక్కడి వ్యాపారులు, రైతులు కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని దుకాణాలకు కాయలు సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన కాయలు కావడంతో ఉగాది పచ్చడి తయారీలో వీటి వినియోగం ఎక్కువగానే ఉంటుంది.

డెల్టా కాలువలకు 10700 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.తూర్పుడెల్టాకు 3200క్యూసెక్కులు, మధ్యడెల్టాలు 2వేలు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి. గోదావరి నీటి లభ్యత 10,700క్యూసెక్కులుగా ఉంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.45 అడుగులుగానమోదయింది.

'లోవ'లో హుండీలు లెక్కింపు

ఆలయానికి రూ.26.52లక్షల ఆదాయం

తుని రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీల లెక్కింపు శనివారం నిర్వహించారు. 45రోజులకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో గల హుండీలను తెరిచిలెక్కించగా ఆలయానికి రూ.26,52,515ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. 270 గ్రాముల వెండి హుండీ ద్వారా ఆలయానికి సమకూరగా ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొనగా ప్రత్యేక అధికారిగా తంటికొండ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి వి.సత్యనారాయణ, కరప గ్రూప్స్ కార్యనిర్వహణ అధికారి రవితేజ హాజరయ్యారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాల బాలాజీ స్వామివారికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. శనివారం దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. కొత్త పాత ఆలయాలు భక్తులతో కళకళ్లాడాయి. అర్చకులు స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారిని శనివారం 2600మంది భక్తులు దర్శించుకున్నారని, 1200మంది భక్తులు నిత్యాన్నదాన పథకంలో భోజనాలు చేశారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.1,22,575 ఆదాయం సమకూరినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మార్కెట్‌కు ఉగాది శోభ





కాకినాడలో మామిడి కాయలు విక్రయాలు

ధరలిలా ఉన్నాయి..

మల్లెలు (కిలో)	రూ. 1,300-1,400
జాజులు (కిలో)	రూ.1,500
చామంతి (ఎల్లో)(కిలో)	రూ.200-280
నీలం చామంతి(కిలో)	రూ.250-270
వైట్ చామంతి (కిలో)	రూ.200-300
లిల్లీ(కిలో)	రూ.150
బంతి(కిలో)	రూ.40-60
డచ్ (20పువ్వులు)	రూ.80-100
కనకంబరం (బారు)	రూ.130-150

కడియం, కాకినాడ మార్చి 29(ఆంధ్రజ్యోతి): కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌కు ఉగాది సందర్భంగా శోభ సంతరించుకుంది. పూల కొనుగోలు దారులు, వ్యాపారులు, రైతులతో మార్కెట్ బిజీగా ఉంది. ప్రస్తుతం పూలమార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

కాకినాడలో వేపపువ్వు విక్రయాలు



కడియం పూల మార్కెట్

నూకాంబిక గవ్వ ఉత్సవం



చింతలూరు నూకాంబికా అమ్మవారి గవ్వ ఉత్సవం

ఆలమూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో నూకాంబికా అమ్మవారి జాతర శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. శనివారం ఉదయం గవ్వ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతరలో గరగనృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దీనితోపాటు పలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం తీర్థమహోత్సవానికి భక్తులకు తరలివచ్చారు. జాతర, తీర్థ మహోత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న గవ్వ ఉత్సవం: నూకాంబికా ఉత్సవాల్లో గవ్వ ఉత్సవానికి అధిక ప్రాధాన్యం ఉంది. శనివారం ఉదయం జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు అమ్మవారికి భక్తులు కోడి, కోడిపిల్లలను అందించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయం తరుపున ఈవో వుండవల్లి వీర్రాజు గవ్వలో కోడిని అందించి ప్రారంభించారు. సినీనటుడు, రచయిత, మూకాభినయ కళాకారుడు పోలాప్రగడ జనార్దనరావు(జెన్నీ) శనివారం నూకాలమ్మను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమలాపురంలో జరుగుతున్న ఒక సినిమా షూటింగ్‌కు వచ్చిన ఆయన అమ్మమ్మ ఊరైన చింతలూరుకు వచ్చి నూకాంబికాను, ఉత్తర ముఖద్వారంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంగతులను ఆయన గుర్తుచేసుకున్నారు. గతంలో కంటే ఆలయం బాగా అభివృద్ధి చెందిందని, భక్తులు సహకారంతో మరింత అభివృద్ధి చెందుతుందని జెన్నీ అన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న సినీనటుడు జెన్నీ

మందపల్లి శనేశ్వరస్వామి ఆదాయం రూ.4.07 లక్షలు

కొత్తపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుదీరారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందించారు. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.4,07,672 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

193 కిలోల గంజాయి పట్టివేత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమీపంలో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వైపు గంజాయితో వెళ్తున్న ఒక కారును బొమ్మూరు పోలీసులు పట్టుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన మనోజ్‌కుమార్‌కు అదే ప్రాంతానికి చెందిన గౌరవ్, మనోల టయోట కరోలా కార్‌లో అనకాపల్లి నుంచి గంజాయిని ఢిల్లీకి తీసుకెళ్లి అప్పగించాలని సూచించడంతో మనోజ్ శనివారం కారులో గంజాయిని తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడు వద్ద రూ.9,69,300 విలువ చేసే 7 బస్తాల గంజాయి పట్టుకుని రూ.1100 నగదు, ఒక సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన సీఐ పి.కాశీ విశ్వనాథ్ ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జల్లెడ పట్టి.. జాడ కనిపెట్టి!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, ఇతర అధికారులు

- ఆరుగురి విద్యార్థుల అదృశ్యం కేసును 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు
- కోనసీమ జిల్లా ఎస్పీ అభినందనలు

అమలాపురం/పి.గన్నవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కండ్రిగపేటకు చెందిన ఆరుగురు విద్యార్థులు అదృశ్యమైన కేసును కొత్తపేట సబ్‌డివిజన్ పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగానే చిన్నారులను గుర్తించి అందరి ప్రశంసలు పొందారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు మీడియాకు వివరించారు. కండ్రిగపేటకు చెందిన ఆరుగురు విద్యార్థులు మూడు వేర్వేరు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్నారు. కొమరగిరి కరుణ (14) కండ్రిగపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి, కొమరగిరి మాధురి (12) రామచంద్రపురంలో ఏడో తరగతి, కొమరగిరి పృథ్వివర్మ (12) 6వ తరగతి, గంధం సత్యనారాయణ (13) 8వ తరగతి, మర్రి సంతోష్ (14) ఏడో తరగతి, కొమరగరి పండు (12) 6వ తరగతి ఆలమూరు మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. వారు సరిగా చదవకపోవడం, పాఠశాలకు కూడా సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దాంతో ఆరుగురు విద్యార్థులు ఈ నెల 24వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా వారి వారి ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. ఆచూకీ కోసం అన్నిచోట్లా గాలించారు. ఎక్కడా కనిపించకపోవడంతో ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు ఆలమూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాల బాలికల అదృశ్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను నియమించారు. విజయవాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, భీమవరం జిల్లాలకు ప్రత్యేక బృందాలను పంపించి రైల్వేస్టేషన్‌లు, బస్‌స్టేషన్లలో విచారణ చేశారు. డ్రోన్ కెమెరాలు వినియోగించారు. చివరకు వారు రావులపాలెం బస్టాండు నుంచి రాజోలు వైపు వెళ్తున్నట్టు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ఆ దిశగా పోలీసులు విచారణ వేగవంతం చేశారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం, పి.గన్నవరం సీఐలు సీహెచ్ విద్యాసాగర్, రుద్రరాజు భీమరాజు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పి.గన్నవరం మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు. చివరకు యర్రంశెట్టివారిపాలెంలో విద్యార్థుల జాడను గుర్తించి వారిని జిల్లా పోలీసు కార్యాలయానికి తీసుకువచ్చారు. కేసు నమోదైన 24 గంటల్లోగానే ఛేదించిన పోలీసు అధికారులతో పాటు ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట ఎస్‌ఐలు అశోక్, చిరంజీవి, రాజేష్‌లు, సిబ్బందిని ఎస్పీ, అదనపు ఎస్పీ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి అవార్డులు అందించారు. విద్యార్థులను అప్పగిస్తున్న సమయంలో తల్లిదండ్రులు డీఎస్పీ మురళీమోహన్ కాళ్లపై పడి పాదాభివందనం చేశారు. విద్యార్థుల అదృశ్యంపై సోషల్ మీడియాలో ప్రచారంతో పాటు సహకరించిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.



పి.గన్నవరం ఎస్‌ఐ బి.శివకృష్ణకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

అధిక వడ్డీకి ఆశ పడినందుకు

రూ.30లక్షలు స్వాహా

పెట్టుబడి పెట్టిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

పనిచేయని యాప్

చీటింగ్ కేసు నమోదు

అమలాపురం టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ వస్తుందని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని నెలవారీ వడ్డీ వ్యాపారం రెండేళ్ల పాటు సాగించాడు. రూ.30లక్షలు పెట్టుబడి పెట్టిన తరువాత సదరు యాప్ పనిచేయకపోవడంతో లబోదిబోమంటూ శనివారం అమలాపురం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు ఈ కేసు వివరాలను వెల్లడించారు. స్థానిక ఎస్కేబీఆర్ కళాశాల రోడ్డులో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భోజనపల్లి రాజగోపాల్ గూగుల్ ప్లేస్టోర్‌లో రెండేళ్ల క్రితం పాల్కన్ ఇన్‌వాయిస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నాడు. అధిక వడ్డీ వస్తుందని తొలుత రూ.50వేలు పెట్టుబడి పెట్టాడు. నెలవారీ అసలు, వడ్డీ సమయానికి అందుతుండడంతో పెట్టుబడి మొత్తాన్ని నెల నెలా పెంచుకుంటూ వెళ్లాడు. క్రెడిట్ కార్డు వినియోగించి రూ.30లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొన్నటి వరకు వడ్డీ, అసలు సక్రమంగా వచ్చేది. గత కొన్ని రోజులుగా సదరు యాప్ పనిచేయడం లేదు. దాంతో తాను మోసపోయినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజగోపాల్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

పిఠాపురంలో ఏం జరుగుతోంది?

- కాకినాడ జిల్లా ఎస్పీ సీరియస్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరా

పిఠాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో అసలు ఏం జరుగుతోంది. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా పోలీసులు ఉదాశీనంగా ఎందుకు ఉంటున్నారు. కఠినంగా వ్యవహరించకపోవడానికి కారణాలు ఏమిటి... అంటూ కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సీరియస్ అయ్యారు. పిఠాపురంలోని పోలీసు స్టేషన్లల్లో సెటిల్మెంట్లు జరుగుతుండడం, ప్రైవేటు వ్యక్తుల హవా పెరిగిపోవడం, పలు కేసుల్లో ఉన్న అనుమానితుడైన వ్యక్తిని రూరల్ ఎస్ఐ ఏకంగా 2 నెలలుగా తన జీపు ప్రైవేటు డ్రైవర్‌గా ఉంచుకున్నా ఉన్నతాధికారులు గుర్తించలేకపోవడం తదితర అంశాలతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 2 నెలల క్రితం బహిరంగ సభ వేదికగా చేసిన హెచ్చరికలను బేఖాతరు చేసేలా పిఠాపురం పోలీసుల వ్యవహార శైలి ఉండడాన్ని ప్రస్తావిస్తూ 'తీరు మారలేదు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్‌తో పాటు సర్కిల్‌లోని నలుగురు ఎస్‌ఐలను ఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. ఆంధ్రజ్యోతిలో ప్రస్తావించిన అంశాలతో పాటు రూరల్ ఎస్ఐ, ప్రైవేటు డ్రైవర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంఘటన నాటి నుంచి జరిగిన పరిణామాలపై వారిని ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి బ్యాచ్ ఆగడాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇకపై ఎటువంటి ఆరోపణలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్రికల్లో వచ్చిన అన్ని అంశాలపై వివరణ ఇవ్వాలని సూచించారు. పోలీసుస్టేషన్ల వద్ద ప్రైవేటు వ్యక్తులు ఎందుకు ఉంటున్నారని, ఫిర్యాదుదారులతో వారు ఎందుకు మాట్లాడాల్సి వస్తోందని ప్రశ్నించినట్టు సమాచారం. మరోవైపు పిఠాపురం పట్టణం, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి పోలీసు స్టేషన్ల పనితీరుపై నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. స్టేషన్ల వద్ద ప్రస్తుతం ఉన్న పరిస్థితి, గతంలో జరిగిన వ్యవహారాలు, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం, పోలీసింగ్ ఎలా ఉంది తదితర వివరాలను సేకరిస్తున్నాయి.

పిఠాపురం రూరల్ ఎస్ఐ సస్పెన్షన్

పిఠాపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఏసీబీకి పట్టుబడిన కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎల్.గుణశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజులను 2024 అక్టోబరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్ఐ రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ లంచం తీసుకుంటుండగా ఈనెల 24వ తేదీ రాత్రి రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌తో పాటు అతడు వినియోగించే పోలీసు జీపుపై ప్రవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లా శివను ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. అప్పటి నుంచి ఎస్ఐ రిమాండ్‌లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ గుణశేఖర్‌ను విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

సైనిక విన్యాసాలకు ఏర్పాట్ల పరిశీలన

సర్పవరం జంక్షన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్ర తీరంలో ఏప్రిల్ 8-13 వరకు నిర్వహించనున్న టైగర్ ట్రయాంఫ్-25 సైనిక విన్యాసాల నిర్వహణ కోసం సూర్యారావుపేట సముద్ర తీరాన్ని శనివారం సైనిక అధికారులతో కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, డీపీవో రవికుమార్ పరిశీలించారు. డీఆర్వో మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట వాకలపూడి బీచ్‌లో నావెల్ ఎన్‌క్లేవ్ పరిధిలో భారత త్రివిధ దళాల విన్యాసాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు. భూమి, సముద్ర, ఆకాశంలో జరిగే విన్యాసాల్లో భాగంగా భూమిపై జరిగే విన్యాసాల కోసం అవసరమైన ఏర్పాట్లు, మెరుగైన శానిటేషన్ చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. విన్యాసాలు జరిగే సమయంలో మత్స్యకారులు ఎవరూ నిషేధిత ప్రాంతంలో వేటలు చేయకుండా మత్స్యశాఖ, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. విన్యాసాల ఏర్పాట్లు, ప్రభుత్వ శాఖల నుంచి సహకారం, సైనిక విన్యాసాలపై సైనిక అధికారులతో చర్చించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ, ఈవోపీఆర్డీ ఎంఎస్ఆర్ రామాంజనేయులు, గ్రామ కార్యదర్శి లక్ష్మీదేవి ఉన్నారు.



సూర్యారావుపేట సముద్రతీరంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఆర్వో, డీపీవో

క్షమాపణ చెప్పిన టీచర్

విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయిన ఘటనపై డీవైఈవో విచారణ

సామర్లకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మహేశ్వరి చేతులపై హిందీ టీచర్ భారతిలక్ష్మి తీవ్రంగా కర్రతో కొట్టడమే గాక ఆరుబయట ఎండలో మోకాలి కుర్చీ వేయించడంతో బాలిక సొమ్మసిల్లి పడిపోయిన ఘటనపై శనివారం ప్రధానోపాధ్యాయురాలు యూ.మీనామాధురి ఆధ్వర్యంలో డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. విద్యార్థిని తల్లితండ్రులు, కౌన్సిలరు పిట్టా సత్యనారాయణ, సంఘటనకు బాధ్యులైన ఉపాధ్యాయురాలు భారతిలక్ష్మీ, ప్లస్‌టు ఉపాధ్యాయులు హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నాను, మొదటి తప్పుగా భావించి క్షమించాలని తిరిగి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని హిందీ టీచర్ భారతిలక్ష్మీ పేర్కొనడంతో లిఖిత పూర్వక లేఖ తీసుకున్నారు. నివేదికలను తదుపరి చర్యల నిమిత్తం జిల్లా విద్యా శాఖాధికారికి అందజేయనున్నట్టు డీవైఈవో తెలిపారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ సెలక్షన్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్‌చే అగ్ని పథ్ స్కీము ద్వారా 2025-26 సంవత్సరానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన అవివాహిత పురుష అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ కోసం జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టులకు సంబంధించిన వివరాలు, విద్య, వయస్సు, శారీరక, ఇతర అర్హతలను ఈ వెబ్ సైట్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

రాత్రి 11:42 గంటలకు..

కొంతమూరులో ఏం జరిగింది?

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు వేగవంతం
- విజయవాడలో 3 గంటలు ఎక్కడున్నారు..
- నలుగురితో ప్రత్యేక బృందం ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన ఐజీ, ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్



పాస్టర్ ప్రవీణ్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై దర్యాప్తు వేగవంతం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు వద్ద ఈ నెల 24వ తేదీ రాత్రి 11:42 గంటలకు ఏం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు. 24న ఉదయం హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయలుదేరిన ప్రవీణ్ పగడాల కొంతమూరు రహదారిలో మరణించే వరకు ప్రతి మూమెంట్‌ను ట్రాక్ చేసే పనిలో పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహకిశోర్ పాస్టర్ ప్రవీణ్ పగడాల పోస్టుమార్టం రిపోర్టులో ప్రాథమిక అంశాలను వెల్లడించారు. చాలా ముఖ్యమైన కేసుగా పరిగణనలోకి తీసుకుని జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ నేతృత్వంలో కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, ఉమామహేశ్వరరావు, విజయ్‌కుమార్‌లతో ప్రత్యేక టీమ్‌ను నియమించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని ట్రాన్స్‌పోర్టు అధికారులు పరిశీలించి నివేదిక ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కీసర- పొట్టిపాడు మధ్య విజయవాడలో ప్రవీణ్ 3 నుంచి 4 గంటల పాటు ఎక్కడ స్టే చేశారు.. అక్కడ ఎవరిని కలిశారు. ఎవరితో మాట్లాడారనేది తేలాల్సి ఉందన్నారు. విజయవాడలో సీసీ కెమెరాలన్నీ పరిశీలిస్తున్నామన్నారు. కొంతమూరులో సంఘటన జరిగిన సమయంలో ప్రవీణ్ బుల్లెట్‌ను దాటుకుని వెళ్లిన 4 కార్లను గుర్తించి వారిని కూడా విచారించామన్నారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

టెంపుల్సే టార్గెట్...

- చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాల బాట పట్టిన ఇద్దరి అరెస్టు
- రూ.10లక్షల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం

అమలాపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్‌తో చిన్నచిన్న మోసాలు చేస్తూ చెడు వ్యసనాలకు బానిసలై చివరకు ఆలయాలనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాల బాట పట్టి వరుసగా నాలుగు చోరీలకు పాల్పడిన దొంగలు సీసీ కెమెరాలకు చిక్కారు. దర్యాప్తును వేగవంతం చేసిన అమలాపురం తాలూకా పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి వెండి ఆభరణాలతో పాటు కొద్ది నగదు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో శనివారం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ విలేకర్లకు వివరించారు. పాండిచ్చేరి యానాంకు చెందిన మల్లాడి కాసురాజు (39), పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కొల్లాటి తిరుపతిరాజు (36) మొదట్లో రైస్ పుల్లింగ్‌పేరుతో కొందరిని మోసం చేశారు. చెడు వ్యవసనాలకు బానిసలైన వారిద్దరు జట్టుకట్టి అమలాపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచే సమీప ప్రాంతాల్లోని ఆలయాల వద్ద రెక్కీలు నిర్వహించి వరుసగా దొంగతనాలకు పాల్పడ్డారు. అల్లవరం మండలం సామంతకుర్రులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది జనవరి 24న చొరబడి 4.800 కిలోల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలోని నవరప్పాంలెం గ్రామంలో శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఫిబ్రవరి 28న చోరీకి పాల్పడి 5.10 కిలోల వెండి ఆభరణాలను చోరీ చేశారు. కొమరగిరిపట్నం షిర్డిసాయిబాబా ఆలయం, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయాల్లో హుండీల నుంచి నగదును అపహరించుకుపోయారు. దీంతో కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ వై.శేఖర్‌బాబు, క్రైమ్ సిబ్బంది బృందంగా ఏర్పడి చోరీలకు పాల్పడ్డ కాసురాజు, తిరుపతిరాజులను శనివారం ఉదయం ముత్యాలపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 లక్షల విలువైన పది కిలోల వెండిని, ఆభరణాలను, రూ.2500 నగదును, నేరాలకు చేయడానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. చోరీలకు పాల్పడ్డ వారిని అమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులతో పాటు క్రైమ్ సిబ్బంది వి.సుబ్బారావు, సీహెచ్ ఏసుబాబు, బి.శివరామకృష్ణ, ఎం.ధర్మరాజు, నాగరాజులను ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ కృష్ణారావు రివార్డులు అందజేయనున్నట్టు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. అన్ని ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత కమిటీసభ్యులకు సూచించారు.



అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

సత్యదేవుని సన్నిధిలో

రూ.2.40 కోట్లతో టెన్‌సెల్ షెడ్డు



ఆలయంలో లారస్ ల్యాబ్ సీఈవో సత్యనారాయణ, డైరక్టర్లకు వేదాశీర్వచనం

అన్నవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం పశ్చిమ రాజగోపురం ఎదురుగా సత్యదేవ అతిథిగృహం తొలగించిన ప్రదేశంలో అత్యాధునిక సౌకర్యాలతో 170/100 అడుగులలో రూ.2.40 కోట్లతో టెన్‌సెల్ షెడ్డు నిర్మాణానికి ప్రముఖ ఫార్మాకంపెనీ లారస్ ల్యాబ్ సీఈవో సత్యనారాయణ చావా, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వి.వి.రవికుమార్ ముందుకొచ్చారు. శనివారం కుటుంబసభ్యులతో వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు నిర్వహించగా ఈవో, చైర్మన్ స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. వచ్చేనెల 2వ తేదీన తమ ఇంజనీరింగ్ బృందం పరిశీలన చేస్తారని అనంతరం 3 నెలల్లో పని పూర్తిచేస్తామని హామీఇచ్చారు. పైన షెడ్, క్రింద ఫ్లోరింగ్, టిక్కెట్టు కౌంటర్లు, భక్తులు వేచిఉండేందుకు ఎయిర్‌పోర్టు చైర్స్, స్పైరో ఫ్యాన్‌లు అమర్చనున్నట్టు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 2003 నవంబరులో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినా కొన్ని సాంకేతిక కారణాలతో ఈ నిర్మాణం నిలిచిపోయింది. గతేడాది డిసెంబరులో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ మరోసారి వారిని సంప్రదించి పనులు ప్రారంభించాలని కోరడంతో అంగీకరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు, ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

నిర్మాణానికి ముందుకొచ్చిన లారస్ ల్యాబ్ ఫార్మా సంస్థ

3 నెలల్లో పని పూర్తిచేస్తామని హామీ

భక్తుల కోసం నూతన కాటేజీ నిర్మాణం

పూర్తయిన టెండర్ల ప్రక్రియ

సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తులకు వసతి సౌకర్యం కల్పనకు నూతన సత్రం నిర్మాణానికి సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. సీతారామసత్రం తొలగించి దానిలో ఒకబ్లాక్‌లో 105 గదులు నిర్మించాలని ఆలోచనతో రూ.8.81 కోట్ల అంచనాతో దేవస్థానం ఈ ప్రోక్యూర్‌మెంట్ టెండర్‌ను పిలిచారు. అయితే ఇటీవల దేవస్థానానికి విచ్చేసిన దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు, చీఫ్‌ఇంజనీర్, ఇతర సాంకేతిక నిపుణులు సీతారామసత్రం పడగొట్టకుండా మరమ్మతులు చేపడితే సరిపోతుందని నివేదిక ఇవ్వడంతో అవే నిధులతో సత్యగిరి కొండపై విష్ణుసదన్ ఎదురుగా దేవదాయశాఖ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల తెరిచిన టెండర్లలో 11మంది పాల్గొనగా 19.80 శాతం లెస్‌కు శ్రీ డిడి కనస్ట్రక్షన్ కంపెనీ ఎల్ 1గా నిలిచినట్టు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ఈ సత్రం నిర్మాణం పూర్తయితే సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తులకు వసతి కష్టాలు చాలావరకు గట్టెక్కనున్నాయి.

నేడు ఉగాది వేడుకలు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు సత్యదేవుని సన్నిధి ముస్తాబయింది. అనివేటి మండపంలోప్రత్యేక మండపం వేయించి వెండి సింహాసనంపై స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు అనంతరం ఆదివారం ఉదయం 9గంటలకు పంచాంగశ్రవణం, ఉగాది పచ్చడి వితరణ నిర్వహిస్తారు. 11 గంటలకు కొండపై స్వామి,అమ్మవార్లను వెండిరథంపై ఊరేగిస్తారు. రాత్రి 7గంటలకు కొండ దిగువున వెండి గజవాహనంపై గ్రామసేవ నిర్వహిస్తారు.

లారీ ఢీకొని నలుగురికి గాయాలు



గాయపడిన యువకులు

కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని నలుగురు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన చౌటిపల్లి నాగేంద్రబాబు, కామిశెట్టి గణేష్, పసుపులేటి మధుసూధనరావులు చినవాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మండలంలోని కుమారదేవం చేరుకునేసరికి అతివేగంగా వచ్చిన లారీ రోడ్డు పక్కగా నిల్చున్న మారిశెట్టి సత్యనారాయణను ఢీకొని ఎడమపక్కగా వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కుమారదేవంనకు చెందిన మారిశెట్టి సత్యనారాయణ చేతికి గాయమై, బైక్ నడుపుతున్న కామిశెట్టి గణేష్‌కు కాలు విరిగింది. చౌటిపల్లి నాగేంద్రబాబు, పసుపులేటి మదుసూధనరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగేంద్రబాబు అందించిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

తొండంగి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బెండపూడి పోలవరం కాల్వ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. తొండంగి మండలం పిఠ చిన్నయ్యపాలెంకి చెందిన గిడుతూరి కాశీ శివరామ కృష్ణ (36), ఆనూరు గ్రామానికి చెందిన ఇండుగపల్లి శ్రీను మోటార్ సైకిల్‌పై కత్తిపూడి వైపు నుంచి తుని వైపు వెళ్తున్నారు. వారిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో వెనుక కూర్చున్న వారికి గాయాలయ్యాయి. శివరామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ బిల్లు చెల్లించకుండా మోసం

పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యుత్ శాఖ అధికారులు

అమలాపురం టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పురపాలక సంఘానికి సమీపంలోని హోటల్ యజమాని విద్యుత్ వాడకం బిల్లు చెల్లించకుండా పాత బిల్లును చెల్లించినట్టు చూపించి మోసం చేయడంతో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.84లక్షల మేర బిల్లు బకాయి ఉండగా శనివారం ఉదయం ఆ శాఖాధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అయితే సదరు హోటల్ యజమాని గతంలో చెల్లించిన బిల్లును చూపించి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించుకున్నాడు. జమ అయిన సొమ్ములు లెక్క తేలకపోగా విచారణ చేసిన అధికారులు జరిగిన మోసాన్ని గుర్తించి హోటల్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సూర్యారావుపేటలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు


కడియంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో టీడీపీ నాయకుల నినాదాలు

టీడీపీ ఆవిర్భావం చారిత్రకం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- ఘనంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం
- ఎన్టీఆర్‌కు తెలుగు తమ్ముళ్ల నివాళి
- పార్టీ పతాకాల ఆవిష్కణ
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు


గోకవరంలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ఒక చారిత్రకమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక తిలక్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. దీనికి వాసుతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డిఅప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావులతో కలిసి హాజరయ్యారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం తెలుగు నాట అతిపెద్ద సామాజిక విప్లవానికి నాంది పలికిందన్నారు. అప్పటి వరకు కేవలం నాలుగు గోడల మధ్య పరిమితమైన రాజకీయం టీడీపీ ఆవిర్భావంతో సామాన్యుని ముంగిటకు చేరిందన్నారు. రూ.2కే కిలో బియ్యం పథకం అప్పట్లో ఒక చరిత్ర సృష్టించిందన్నారు. ఎన్టీఆర్ తర్వాత పార్టీ సారథ్య బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పార్టీని మరో స్థాయికి తీసుకెళ్లారన్నారు. అలాగే స్థానిక శ్రీరాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి గన్ని కృష్ణ, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌లతో కలిసి నివాళులర్పించారు. అలాగే చలివేంద్రాన్ని గన్ని కృష్ణ ప్రారంభించారు.

జేఎన్ రోడ్డులో ఎన్టీఆర్ పార్కు..

స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాల పక్కనే ఉన్న పార్కుకు ఎన్టీఆర్ పార్కుగా నామకరణం చేసి ఆ పార్కును, అందులో సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను ఎమ్మెల్యే వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ పార్కుకు ఎన్టీఆర్ పేరు పెట్టాలని తీర్మానించామన్నారు. అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం ఈ పార్కుకు పేరుపెట్టకుండా హ్యాపీ స్ట్రీట్‌గా ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పార్కుకు ఆయన పేరు పెట్టామన్నారు. విగ్రహాన్ని తయారు చేసిన వడయార్‌ను సత్కరించారు. కార్యక్రమాల్లో కుడుపూడి సత్తిబాబు వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధ, మజ్జి రాంబాబు, నక్కా చిట్టిబాబు, దాస్యం ప్రసాద్, రాచపల్లి ప్రసాద్, బుడ్డిగ రవి, మళ్ల వెంకట్రాజు, ఆడారి లక్ష్మినారాయణ, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, తురకల నిర్మల, మీసాల నాగమణి, తుల్లి పద్మ, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రమైన రాజానగరంతోపాటు గ్రామ గ్రామాన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు తెలుగు తమ్ముళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి నీలపాల అరవరాజు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే చక్రద్వారబంధం, కలవచర్ల, సీతారాంపురం, నరేంద్రపురం, నందరాడ, వెలుగుబంద, రాధేయపాలెం, తోకాడ, కానవరం, పఠిజెల్లిపేట, మల్లంపూడి, ముక్కినాడ, పల్లకడియం, తూర్పుగోనగూడెం గ్రామాల్లో నందమూరి తారకరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, బచ్చు ప్రసాద్, కొణతం నరసింహారావు, బైరెత్తి మల్లిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, మద్దూరి గొల్లబ్బాయి, కుర్రి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: శ్రీకృష్ణపట్నంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు బత్తుల త్రిమూర్తులు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 43 ఏళ్ల ప్రస్థానంలో టీడీపీ రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో కీలకశక్తిగా నిలిచిందని చెప్పారు.

మాజీ జడ్పీటీసీ కొల్లం రత్నం మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని చంద్రబాబు తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా ప్రకాష్, నర్గిన సీతారాం, కొట్టిరాజు, ద్రాక్షారపు గోవిందు, బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలో పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బిక్కవోలు వంతెన వద్ద ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, చాగంటి సాయిబాబారెడ్డి పాల్గొన్నారు. ఊలపల్లిలో తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, పందలపాకలో పడాల సూర్యనారాయణరెడ్డి, రంగాపురంలో నడింపల్లి చిరంజీవిరాజు, కొమరిపాలెంలో డీవీఆర్, ఇళ్లపల్లిలో తనుకు శ్రీధర్, కొంకుదురులో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

గోకవరం: గోకవరంలోని దేవిచౌక్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలకు స్థానిక టీడీపీ నాయకులందరూ హజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కృష్ణునిపాలెం, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం, తదితర గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు పండుగలా జరుపుకున్నారు.

ధవళేశ్వరం: స్థానిక కొత్తపేట వద్ద ప్రధాన రహదారిపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ పట్టణాధ్యక్షుడు పండూరి అప్పారావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు నీలి కోటేశ్వరరావు, అడపా శ్రీను, నాళ్ల రమేష్, నందిగం సత్యనారాయణ, బర్రి సుబ్బారావు, కొత్యాల సుబ్బారాయుడు, పల్లా రామస్వామి పాల్గొన్నారు.

అనపర్తి: రామవరంలో టీడీపీ జెండాను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఎగురవేశారు. అలాగే గ్రామంలోని ఎన్టీఆర్, నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాలకు, పొలమూరు, చిన పొలమూరు గ్రామాల్లో ఎన్టీ ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత రం అనపర్తి ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ టీడీపీ ఆవి ర్భావ సభలో ఆయన ప్రసంగిస్తూ తెలుగుదేశం పార్టీ పేదల సంక్షేమం కోసమే ఆవిర్భవించిందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న నాయకులను, కార్యకర్తలను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, ఆళ్ల గోవిందు, జుత్తుగ కృష్ణ, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, పాల్గొన్నారు.


అనపర్తిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడియం: కడియంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ నిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతుందని, కోటి మంది సభ్యత్వం కలిగిన పార్టీ అని అన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, బొర్సు సురేష్, అనుసూరి గోవిందరాజు, కనికెళ్ళ బుల్లియ్య, జల్లి కృపారావు, చిలుకూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని 17 గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నాయకుడు యలమాటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుకొండ: స్థానిక బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. అలాగే కోరుకొండ, కోటి గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కోటి గ్రామంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి అడపా వీరబాబు ఆధ్వర్యంలోను, కోరుకొండలో దాశెట్టి శ్రీను ఆధ్వర్యంలోను టీడీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కోటిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల, ఎంపీపీ వెలుగు బంటి సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా 32 మంది కార్యకర్తలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడారు. తెలుగు వారికి గుర్తింపు, గౌరవాన్ని ఎన్టీఆర్ తీసుకొచ్చారన్నారు. గత పాలకుల వల్ల అప్పుల పాలైన రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, దానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల్లో కూడా కార్యకర్తలకు భాగస్వామ్యం కల్పించి ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మత్సేటి శివసత్యప్రసాద్, కడియం అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, వాసిరెడ్డి రాంబాబు, షేక్ సుభాన్, మార్ని వాసుదేవ్, నిమ్మలపూడి గోవింద్, నున్న కృష్ణ, కురుకూరు కిషోర్, చెల్లుబోయిన శ్రీనివాస్, శీలం గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయ అభివృద్ధికి సమష్టి కృషి: వీసీ

యూనివర్శిటీలో ఉగాది పురస్కారాల వేడుక


పూర్వ వీసీ జార్జ్‌విక్టర్ దంపతులను సత్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషిచేయాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్శిటీలో శనివారం నిర్వహించిన ఉగాది పురస్కార వేడుకల్లో ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఆయా విభాగాలల్లో చక్కని పనితీరు కనబరిచిన సిబ్బందికి ఉగాది పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పూర్వ వీసీ ఆచార్య పి.జార్జ్‌విక్టర్, శిరోమణి దంపతులను సన్మానించి ఉగాది పురస్కార సన్మానపత్ర జ్ఞాపికను అందజేసి ఆయన సేవలను కొనియాడారు. విక్టర్ మాట్లాడుతూ ఆత్మ, పరమాత్మ, వివేకం పేరు ఏదైనా మంచిని చేస్తూ ముందుకు సాగితే మంచే జరుగుతుందన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలను నూతన విద్యావిధానంలో జోడించాలని చెప్పారు. అనంతరం వర్శిటీలోని వివిధ విభాగాలకు చెందిన చక్కని పనితీరు కనబరచిన సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. అంతకుముందు యూనివర్శిటీ ప్రాంగణంలోని నన్నయ విగ్రహానికి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్స్ కె.సుబ్బారావు, పి.విజయనిర్మల, బి.అశోక్. వివిధ విభాగాల అధ్యాపకులు, అధికార్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నర్సుల సేవలు నిరుపమానం

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ నర్సింగ్, స్వతంత్ర నర్సింగ్ కళాశాలలు సంయుక్తంగా శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశంలో మేధా సంపత్తికి కొదువలేదని, జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అనేక మార్లు ఇతర దేశాలకు వెళ్లి వైద్య రంగంలో మెలకువలను బోధించడం భారతీయ మేధస్సుకు శుభప రిణామంగా చెప్పారు. ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ కొత్తపల్లి సుశీల మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలతో పాటు నర్సింగ్ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. గన్ని భాస్కరరావు మాట్లాడుతూ నర్సుల సేవలే రోగులకు త్వరగా ఉపశమనం కలిగిస్తాయ న్నారు. ప్రిన్సి పాల్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల నుంచి ఎమ్మెస్సీ, బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణత వివరాలను వెల్లడించారు. కార్యక్ర మంలో స్వతంత్ర నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆకర్షణల వైపు అడుగులేయొద్దు: జడ్జి బాబు

కడియం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మీ బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని ఆకర్షణల వైపు అడుగులు వేయకుండా, చదువుపై దృష్టి సారించాలని రాజమహేంద్రవరం 7వ అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ పి.బాబు అన్నారు. కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన బాలికా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ బాలికా రక్షణ చట్టాలను వివరించారు. మేజిస్ట్రేట్ పి.బాబు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న దారుణాలు, అనేక కేసుల్లో విద్యార్థినులకు తెలియజేశారు. ఆడపిల్లలు ప్రలోభాలకు లోను కాకుండా చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన ఉండాలని మేజిస్ట్రేట్ సూచించారు.



బాల్యం నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న

రాజానగరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న పేర్కొన్నారు. కొంతమూరులోని ఓ స్కూల్‌ను శనివారం సందర్శించారు. దీనిలో భాగంగా బాలికలకు పోక్సో చట్టంపై అవగాహన కలిగించారు. కౌమార దశలో బాలికలు పాటించాల్సిన పద్ధతులు, అపరిచిత వ్యక్తుల పట్ల ఏవిధంగా వ్యవహరించాలో వివరించారు. కార్యక్రమలో పాఠశాల హెచ్ఎం, ఎస్.ఐ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గోకవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులందరూ పూర్తి అవగాహన కల్గి ఉండాలని రాజమహేంద్రవరం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.జగదీశ్వరి అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల్లో శనివారం పోక్సో చట్టంపై విద్యార్థినులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, గుడ్ టచ్, బేడ్ టచ్ గూర్చి వివరించారు. పోక్సో చట్టంపై విద్యార్థినులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్‌తో పాటు పాఠశాల నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

బిక్కవోలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు గ్రామదేవత నూకాలమ్మ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి జాగరణ జరిగింది. కార్యక్రమంలో గరగ నృత్యాలు, కోలాటం, తీన్‌మార్, బ్యాండు కచేరీలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పదో తరగతి సాంకేతిక పరీక్షలకు 76 మంది హాజరు

రంగంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వడిశలేరు హైస్కూల్లో పదో తరగతి సాంకేతిక పరీక్షలకు 76 మంది విద్యార్థులకు గాను 76 మంది హాజరయ్యారని ఎంఈవో పి.మధుసూధనరావు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో ఎలక్ట్రానిక్ పరీక్షకు 39 మందికి 39 మంది, ఆటోమోటివ్ పరీక్షకు 37 మందికి 37 మంది హాజరయ్యారన్నారు. రంగంపేట, సింగంపల్లి హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో ఈ సాంకేతిక పరీక్ష జరగలేదని ఎంఈవో తెలిపారు.

600లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

అనపర్తి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీరారామచంద్రపురంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడులో భారీగా సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను కనుగొన్నారు. స్థానిక చెరువు గట్టు సమీపంలో సారా తయారీకి వినియోగించే 600 లీటర్ల బెల్లపుఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితుల కోసం విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

రూ.25 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం!

కలెక్టర్‌కు ఎమ్మెల్యే బత్తుల ప్రతిపాదనలు

కోరుకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రాజానగరం నియోజకవర్గంలో రూ.25 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించడానికి అవసరమైన ప్రతిపాదనలు శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలెక్టర్ ప్రశాంతికి అందజేశారు. పంచాయతీరాజ్ పరిధిలోని గ్రామీణ రోడ్లలో అధ్వానంగా ఉన్న వాటిని సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి అధికార యంత్రాంగంతో కలిసి తయారు చేయించిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ ప్రతిపాదనలు త్వరగా ఆమోదించి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అలాగే నియోజకవర్గానికి సంబంధించిన అత్యవసర పనులు, ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా ప్రయత్నాలు చేసి నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఎంపీపీ సుమకు ఎంపీ అభినందన

బిక్కవోలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ ఎంపీపీగా ఎన్నికైన బిక్కవోలు మండల ఎంపీపీ తేతలి సుమ, ఎంపీటీసీలతో కలసి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సుమను ఎంపీ సత్కరించి పార్టీ అండగా వుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎంపీటీసీలు కొర్ల చక్రరావు, జంపా వెంకటలక్ష్మి, బండారు శివ, గొర్రెల భాగ్యలక్ష్మి, తొండాపు శాంతిశ్రీలక్ష్మి, చిన్నం వీర్రాఘవరెడ్డి, కేతా ఏసురత్నం వున్నారు.

నారాయణరావుకు ఉగాది పురస్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రాకా సాంస్కృతిక సంస్థ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా గోకవరం బస్టాండ్ సమీపంలో కంటే వీరన్నచౌదరి హాస్పిటల్ ప్రాంగణంలోని ఎస్వీ బాలు సాంస్కృతిక మందిరంలో, శనివారం సాయంత్రం నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ టీవీ నారాయణరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రవచనం చేస్తూ ఉగాది విశేషాలను వినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావును సత్కరించారు. భారత ప్రభుత్వం ఎన్‌హెచ్ఆర్‌సీ విభాగం ద్వారా హ్యూమన్ రైట్స్ షార్ట్ ఫిల్మ్‌కు దర్శకత్వం వహించి ప్రత్యేక జ్యూరీ అవార్డుకు ఎంపికై,ఈ నెల 26న న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన మడక వెంకట సత్యనారాయణ(సతీష్)ను రాకా సంస్థ ఉగాది పురస్కారం అందజేసింది. ఉగాది సందర్భంగా మోహన్ పబ్లికేషన్స్ అధినేత ఆకుల మోహనరావు సభ్యులందరికీ పంచాంగాలను పంపిణీ చేశారు.

విద్యుత్ తీగలపై కూలిన గోడ

మరమ్మతులకు గురైన గృహోపకరణాలు


గోకవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలపై గోడ కూలడంతో గృహోపకరణాలు మరమ్మతులకు గురైన సంఘటన శనివారం గోకవరంలో జరిగింది. గ్రామంలో పంచాయతీ ఎదురుగా ఉన్న 12వ వార్డులో పాత భవనాన్ని తొలగిస్తుండగా సమీపంలోని విద్యుత్ తీగలపై గోడ కూలడంతో ఈ సంఘటన జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే వార్డులోని మూడు వీధుల్లో సుమారు 50 గృహాల్లో ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, ఇతర గృహపకరణ వస్తువులు మరమ్మతులకు గురైనట్టు బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి విద్యుత్‌ను పునరుద్ధరించడంతోపాటు, మరమ్మతుకు గురైన గృహోపకరణాల వస్తువుల లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రధానోపాధ్యాయురాలిపై దాడి

ఇద్దరు మహిళలపై కేసు నమోదు

సీతానగరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగవరం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కడలి నాగమణి కుమారిపై దాడి చేసినందుకు ఈలి నాగలక్ష్మి, ఈలి లావణ్యలపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు తెలిపారు. శనివారం ఉదయం స్కూల్ ఆవరణలోని మామిడిచెట్టు కాయలు ఎందుకు కోశారని, హెచ్ఎం అడిగినందుకు నాగలక్ష్మి, లావణ్యలు భయభ్రాంతులకు గురిచేసి, చేతులతో దాడిచేసి ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తామంటూ బెదిరించారు. ఈ ఘటనపై హెచ్ఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 30 మార్చి 2025







ఉగాది.. ఈ ఏడాది!

అమలాపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సుఖదుఃఖాల కలయికే జీవితం...మంచి చెడుల కలయికే ఓ కొత్త సంవత్సరం. కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో అడుగిడాలని అందరి ఆకాంక్ష. విశ్వావసు నామ సంవత్సరంలో కొన్ని రంగాల్లో మంచి జరిగితే.. మరికొన్ని రంగాలకు చెడు జరుగుతుందని పంచాంగకర్తలు చెబుతున్నారు. సర్వేజనా సుఖినోభవంతు అని పలికే పంచాంగకర్తలు గ్రహస్థితులను లెక్కలు కట్టి కొవిడ్ తరహాలో ఈ ఏడాది ఏదైనా విపత్తు వచ్చే అవకాశం ఉందంటున్నారు. షష్టగ్రహ కూటమి, కాలసర్పయోగం, పంచగ్రహ కూటమితోపాటు గురుడు ఏడాదికి ఓ రాశి చొప్పున మారాల్సి ఉండగా విశ్వావసు నామ సంవత్సరంలో మూడు రాశుల్లో సంచారం చేయడం వల్లే ఈ తరహా పరిస్థితులు తప్పవంటున్నారు. మీన రాశిలో షష్టగ్రహ కూటమిలో భాగంగా సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు, శని, రాహువు సంయోగం చెందడం వల్ల ఆ ప్రభావం ద్వాదశ రాశుల వారిపై మూడు నెలలు ప్రభావం చూపుతుంది. దానికితోడు జులై 27 వరకు కాలసర్ప యోగం ఏర్పడడంతోపాటు మార్చి 31 నుంచి ఏప్రిల్ 13 వరకు పంచగ్రహ కూటమి వల్ల మండే ఎండలు, వేసవి తీవ్రత, అకాల మరణాలు తప్పవంటున్నారు. అనారోగ్యాలు, యుద్ధభూమి ఆందోళనకర పరిస్థితులు ఉంటాయంటున్నారు. అదేవిధంగా పలు రంగాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతుందని వివరిస్తున్నారు.

చల్లంగచూడు.. నూకాంబికా!

చింతలూరు.. ఈ పేరు సుపరిచితమే.. గోదావరి జిల్లాల్లో ఇక్కడ వెలసిన అమ్మవారు సుపరిచితమే.. చింతలూరు నూకాంబికగా భక్తజనం కొలుస్తారు.. అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి.. చల్లంగ చూసే దేవతగా భక్తజనం అమ్మవారిని చూస్తారు.. పిల్లలపై అమ్మవారు రాకుండా ఉండాలంటే ఇక్కడ కాగడాలు వేయించాలనేది భక్తుల నమ్మకం.. ప్రతి ఏడాది ఉగాది ముందు రోజు నుంచి ఉత్సవాలు ఆరంభమవుతాయి. నెలరోజులపాటు నిరాటంకంగా జరుగుతాయి.. శనివారం లక్షలాదిగా భక్తజనం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - ఆలమూరు



- (కాకినాడ/అమలాపురం / రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇక నుంచి ఉగాది ఉషస్సులే..

కూటమిపై జనం విశ్వాసం ఉంచారు.. చంద్రబాబును సీఎంను చేస్తే ఏపీ దిశ.. దశ మారుతుందని నమ్మారు.. సూపర్ 6 హామీలను చూసి మురిసిపోయారు.. ఇంకేంటి గత సార్వత్రిక ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విజయాన్నదించారు.. రాష్ట్రవ్యాప్తంగా 175 స్థానాలు ఉంటే 164 స్థానాల్లో కూటమిని గెలిపించారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అయితే క్లీన్‌స్వీప్ చేశారు.. మరి ఆ విశ్వాసాన్ని కూటమి నిలబెట్టుకుంటుందా అంటే.. జనం ఓటేసి విశ్వాసాన్ని చూపితే.. చంద్రబాబు ప్రభుత్వం కూడా విశ్వావసు నామ సంవత్సరంలో సూపర్ 6 హామీల అమలుపై దృష్టిపెట్టింది.. మరో రెండు నెలల్లోనే తల్లికి వందనం.. అన్నదాతా సుఖీభవ తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయనుంది..

ఉందిలే మంచీ కాలం ముందు ముందునా.. అందరూ సుఖపడాలి.. ఈ రాష్ట్రమునందునా.. అన్నట్టుగానే.. ఆ మంచి కాలం రానుంది. తెలుగు సంవత్సరాది ఉగాది వేళ.. కోటి ఉషస్సుల కొత్త కాంతిలో సామాన్యుల జీవితాలు కొత్త వెలుగును సంతరించుకోనున్నాయి. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం తీసుకొనున్న పథకాలు ప్రజలకు భరోసాగా నిలవనున్నాయి. సర్కారు చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమాలతో సామాన్యుడి బతుకు చిత్రం మారనుంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇప్పటికే కొత్త పింఛన్లు, సదరం సర్టిఫికెట్ల జారీ, కొత్త రేషన్ కార్డుల సమాచారం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు ప్రక్రియ, బీసీ రుణాలు, మహిళలకు కుట్టుమెషీన్లు, మే నెలలో తల్లికి వందనం, జూన్‌లో అన్నదాతా సుఖీభవ వంటి పథకాలను ప్రజలకు అందించనుంది.

అన్నదాతా సుఖీభవ..



కూటమి ప్రభుత్వం రైతుల్లో భరోసా నింపే అనేక కార్యక్రమాలు చేపడుతోంది. త్వరలోనే అన్నదాతా సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టనుంది. రైతన్నలకు అండగా నిలిచేలా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించనుంది. రానున్న మే, జూన్ నెలల్లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాలో ఉన్న పీఎం కిసాన్ పథకం కింద 1.12 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య దాదాపు 1.20 లక్షలకు చేరుకోనుంది. కాకినాడ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.



తల్లికి వందన..మే



మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పథకాన్ని సీఎం నారా చంద్రబాబు ఎన్నికల హామీగా ఇచ్చారు. ఈ పథకంలో ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎంత మంది ఉంటే అంత మందికి అందించనున్నారు. కాకినాడ జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 3,10,003 లక్షల మంది ఉండగా 1,87,671 మంది తల్లులు ఉన్నారు. కోనసీమ జిల్లాలో 2.25 లక్షల మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2.48 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

మహిళలకు కుట్టు మెషీన్లు..

మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి వారికి మెషీన్లు పంపిణీ చేసేందుకు కూడా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. 18 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులు. నియోజకవర్గానికి మూడు వేల మెషీన్లు అంద నున్నాయి. 45, 60, 90 రోజుల శిక్షణ పూర్తయిన అనంతరం వీటిని లబ్ధిదారులకు అందజేస్తారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 3243 మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది.

ఆనందమనిపింఛెన్..



దివ్యాంగులకు కొత్త పింఛన్లు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.జిల్లా ఆసుపత్రుల్లో దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. నెలలో మొదటి మంగళవారం జిల్లాలోని ఏరియా ఆసుపత్రిలో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు అందజేసి లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది. ఎమ్మెల్సీ కోడ్ కారణంగా నిలిచిపోయిన స్పౌజ్ పెన్షన్లను ఏప్రిల్ నెల నుంచి పంపిణీ చేయడానికి నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్ర త పింఛన్లు ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు.కాకినాడ జిల్లాలో 2,71,039 మంది పింఛనుదారులకు రూ.116.89 కోట్లు,తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 2,35,076 మంది లబ్ధిదారులకు రూ.102.28 కోట్లు, కోన సీమ జిల్లాలో 2,35,887 మంది లబ్ధిదారులకు రూ.100.90 కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు.వీటితో పాటు మే నెలలో కొత్తగా పెన్షన్లు విడుదల చేయనున్నారు.

'గృహ'త్తర పథకం..

పేదింటి కల తీరుస్తున్నారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు పీఎం ఆవాస్‌యోజన, అర్బన్ పథకాల కింద రుణాలు మంజూరు చేస్తున్నారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే ఇప్పటివరకు స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే అర్హులను 12,213 మందిగా గుర్తించారు. వీరిలో అముడా, రుడా పరిధిలో 11,134 మంది అర్బన్ పరిధిలో 484 మంది, గ్రామాల్లో 595 మందిని అర్హులుగా గుర్తించారు. కాకినాడ జిల్లాలో సొంత స్థలాలు ఉండి ఇళ్ల కోసం 19500 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1800 మంది వివిధ మునిసిపాలిటీల పరిధిలో దరఖాస్తు చేశారు. కాకినాడ నగరంలో 945 ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ 15 వేల వరకూ దరఖాస్తులు అందినట్టు సమాచారం. అర్బన్ పరిధిలో గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు, గ్రామీణ లబ్ధిదారులకురూ.1.80 లక్షలు రుణాలుగా అందజేస్తారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు అదనపు సాయం అందిస్తుంది.

బాబు సూపర్ 6

అభివృద్ధి.. డ్వాక్రా

ఒకప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలోనే ఊపిరి పోసుకున్న డ్వాక్రా సంఘాలు ఇప్పుడు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. డ్వాక్రా మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 18 వేల మంది ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. వీళ్లకు ఒక యాప్‌ని ఇస్తారు. దానిలో డ్వాక్రా సంఘంలోని మహిళల పూర్తి వివరాలను నమోదు చేస్తారు. డ్వాక్రా రు ణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకునే దిశగా ప్రోత్సహించి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తారు. జిల్లాలోని 3200 మహిళా సంఘాల్లోని 3.10 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.



రుణాల జాతర..

రుణాల జాతర మొదలైంది. ఈ నెల 11న కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఈనెల 25తో గడువు ముగిసింది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు. బీసీ ఉపకులాలు, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు కులాలు స్వశక్తితో ఆర్థికంగా బలపడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1,275 యూనిట్ల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.12. 26 కోట్లు సబ్సిడీతోపాటు రూ.12.26 కోట్లు రుణంగా అందిస్తారు. మిగిలిన కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.



ప్రజలకు మంత్రి, కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసారు. షడ్రుచుల కలయికతో కూడిన ఉగాది పచ్చడిలా ఈ ఏడాది అన్ని రుచుల మేళవింపుతో ఆనందంగా గడపాలన్నారు. శ్రీ విశ్వావసునామ సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని కోరారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థినీ విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం సంక్షేమశాఖల అధికారులతో సమీక్షించారు. సామాజిక బాధ్యత కింద కంపెనీలు, వ్యక్తుల నుంచి సేకరించే నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం నాటికి హాస్టళ్లు, పాఠశాలలను హేతుబద్ధీకరణ విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్‌వాల్ నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల ఆయా కార్యక్రమాల అమలు విషయంలో జిల్లా పరిధిలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి బాధ్యత వహించాల న్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ఐదు ట్రాక్టర్లు స్వాధీనం

అక్రమంగా మట్టి తరలింపే కారణం 10



రఘునాథ శర్మ | డా.దంటు మురళీకృష్ణ | అరిపిరాల నారాయణరావు | బులుసు అపర్ణ | తాతా సందీప్ శర్మ | నల్లమిల్లి సుబ్బారెడ్డి | రవి పరస

ఏడుగురికి ఉగాది పురస్కారాలు

రాజమహేంద్రవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో జిల్లా నుంచి ఇద్దరు కళారత్న, ఐదుగురు ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు.ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సాహిత్యంలో రాజమహేంద్రవరానికి చెందిన ఆచార్య శలాక రఘునాథ శర్మ, డా.దంటు మురళీ కృష్ణ (సంస్కృతం)కు కళారత్న, సాహిత్యంలో రాజమహేంద్రవరానికి చెందిన డా.అరిపిరాల నారాయణరావు, అవధాన విభాగం నుంచి బులుసు అపర్ణ, తాతా సందీప్ శర్మ, సామాజిక సేవలో అనపర్తికి చెందిన నల్లమిల్లి సుబ్బారెడ్డి, రాజమహేంద్రవరానికి చెందిన అంతర్జాతీయ ప్రముఖ నఖ చిత్రకారుడు డాక్టర రవి పరసకు ఉగాది పురస్కారాలు దక్కాయి. విజయవాడలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి ఉగాది వేడుకల్లో పురస్కారాలు అందుకుంటారు.

నేడు ఎంపీ కార్యాలయంలో ఉగాది ఉత్సవం



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం జరగనుంది.ఈ మేరకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఎస్‌వీ ఫంక్షన్ హాలులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు దైవజ్ఞరత్న, వాస్తు జ్యోతిష్య ప్రవీణ పుల్లెల సత్యనారాయణచే పంచాంగ శ్రవణం ఉంటుంది. అనంతరం వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేయడం జరుగుతుందని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్ర మానికి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలు హాజరుకావాలన్నారు.



జై..టీడీపీ

కొవ్వూరులో..

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు.. కార్యకర్తలు.. అభిమానులు హాజరై పండుగల చేసుకున్నారు. అన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఎక్కడికక్కడ టీడీపీ జెండాలను ఎగురవేశారు.. జై ఎన్టీఆర్.. జై టీడీపీ.. జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు.. - వివరాలు 10లో



ఇఫ్తార్ విందు

మనం మనం ఒకటే.. హిందూ ముస్లిం బాయిబాయి.. అదే మన నినాదం.. అలాగే కలిసుందాం.. ఆనందాలను పంచుకుందాం అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్‌రీజెన్సీ పందిరి ఫంక్షన్‌హాలులో శనివారం సాయంత్రం ముస్లింలకు ఆత్మీయ ఇఫ్తార్ విందు ఇచ్చారు. - రాజమహేంద్రవరం అర్బన్



అదుపుతప్పిన లారీ నలుగురికి గాయాలు

10

లాభాల బాట పట్టించండి!

ఇదేదో ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్‌లా ఉందే అనుకుంటే పొరబడినట్టే.. ఈ బస్‌లో ఉన్నది ఆర్టీసీ సిబ్బందే.. బస్‌లో ఎక్కడికి వెళుతున్నారంటారా.. ట్రయల్‌కి.. మరీ ఆమె ఎందుకంటారా..! ఆమె కదా చూడాల్సింది.. ఎందుకంటే ఆమె ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల ఆశోక.. నిడదవోలు డిపోలో బస్‌లు చూస్తే అన్నీ పాతవే.. ఒక్కటీ కొత్తది కనిపించదు.. దీంతో నిత్యం మరమ్మతులే.. డిపోలో ఆదాయం తక్కువ.. పెట్టుబడి ఎక్కువ.. ఎందుకిలా జరుగుతుందో తెలుసుకోవాలని శనివారం ఇలా నిడదవోలు డిపోను పరిశీలించారు.. ఎక్కడ లోపం ఉందో తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని.. డిపోను లాభాల బాటలో ఉంచాలని ఆదేశించారు. - నిడదవోలు



కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి
● ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం బస్టాండ్, విజయవిహార్ సెంటర్‌లలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను శాలువాలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని స్థాపించి 43 సంవత్సరాలు పూర్తిచేసుకుని 44వ సంవత్సరంలోకి 1అడుగు పెట్టిందన్నారు. అన్న నందమూరి తారక రామారావు సినీ రంగంలో రారాజుగా వెలుగొందుతూ ప్రజలను చైతన్య పరిచే విధంగా ఆదర్శవంతమైన సినిమాలుతీసి సమాజ అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. దేవుడు అంటే ఇలా ఉంటాడు అని చూపించిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగువారి ఆత్మ గౌరవం కాపాడాలని బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని పి4 విధానాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, మద్దిపాటి సత్యనారాయణ, మద్దుల సత్యనారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, నాదెళ్ళ శ్రీరామ్, బర్ల శ్రీనివాస్, పెనుమాక జయరాజు, గెల్లా సురేష్, బొబ్బిలి పేర్రాజు, నున్న సాయి, కె.విజయలక్ష్మి, కేతా సాహెబ్, మంకెన వీర్రాజు, యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి రాఘవులు, తోరం నగేష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు పట్టణంలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశిష్ లాల్, పసలపూడి బోసు, బూరుగుపల్లి రాఘవులు, వేగి చిన్నా పాల్గొన్నారు.

పెరవలి: టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పెరవలి, కానూరు, తీపర్రు, అజ్జరం, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, కొత్తపల్లి, అన్నవరప్పాడు, పిట్లవేమవరం, తదితర గ్రామాల్లో పార్టీ పతాకాలను ఎగుర వేసి ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పలువురు సీనియర్ పార్టీ నాయకులకు నిడదవోలులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. అతికాలశ్రీను, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయణరావు, వాకలపూడి వీర్రాజు, నల్ల సురేంద్ర, భూపతిరాజు రవివర్మ, హనుమంతు సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి: బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీ ఆవిర్భావిం చిందని మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ పేర్కొన్నారు. మండలంలో దేవరపల్లి, యర్నగూడెం, యాదవోలు, కురుకూరు, లక్ష్మీపురం, గౌరీపట్నం, దుద్దుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఆయా పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు, టీడీపీ నేతలు ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని జాతీయస్థాయిలో వెలుగెత్తి చెప్పిన ఘనత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే చెందుతుందన్నారు. దేవరపల్లిలో ముందుగా టీడీపీ పార్టీ జెండాను గ్రామ టీడీపీ అధ్యక్షులు గద్దే సుబ్రహ్మణ్యం, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు సుంకర దుర్గారావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కరుటూరి శ్రీనివాస్, ఉప్పు లూరి రాంబాబు, ముళ్ళపూడి దొరాజీ, పెనుమత్స సుబ్బరాజు, కొండపల్లి దొరయ్య, క్రాబు బీమరాజు, యాగంటి సాయిబాబు పాల్గొన్నారు.


నిడదవోలులో సీనియర్ నాయకులను, కార్యకర్తలను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

చాగల్లు: మండలంలో టీడీపీ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చాగల్లు, సెంటర్ లోని జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, కోడి చంటియ్య, జొన్నకూటి సుబ్బారావు, జే వెంకాయమ్మ, ఊబా దుర్గ, పాల్గొన్నారు. నెలటూరులో జరిగిన కార్యక్రమంలో తాళ్ళూరి ప్రసాద్, యడ్లపల్లి రకారావు, తాళ్ళూరి శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారావు, మురళి, నందిగం శ్రీను, పాల్గొన్నారు. ఊనగట్లలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో బొల్లిన శివనాగేంద్ర, కారింకి సత్యన్నారాయణ పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. చిక్కాలలో వై.అబ్బులు చౌదరి ఆధ్వర్యంలోను, దారవరంలో బొడ్డు రాజు, కేశల ఆధ్వర్యంలోను, చంద్రవరంలో మద్దిపాటి వీరరాఘవులు, మల్లవరంలో కోడూరి కాశి గంగాధరరావు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నుగ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్‌బూరుగుపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చివటం, ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త, సూర్యారావుపాలెం, కాల్ధరి తదితర గ్రామాల్లోఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపురం: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు.

నల్లజర్ల: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నల్లజర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం అనంతపల్లిలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి టీడీపీ జెండా ఎగరవేశారు. కెంగం శ్రీను, వలిరెడ్డి సతీష్, దాసు రాజా, చింతా ఏసు, కె. ప్రసాద్, తలారి కృష్ణ పాల్గొన్నారు. నల్లజర్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, టీడీపీ మండల ఉపాధ్యక్షులు గుదే వెంకటసుబ్బారావు, చింత చైతన్య, భార్గవ్, సవలం రామకృష్ణ, మోదుగ సుబ్బారావుత పాల్గొన్నారు.

తాళ్లపూడి: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో టీడీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉడతా వీరేంద్ర, కడలి కిరణ్‌కుమార్, సూర్య, సంపతి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. గజ్జరంలో టీడీపీ నాయకులు కాకర్ల వంశీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దండమూడి శేష తదితరులు పాల్గొన్నారు. పెద్దేవంలో కోడి శంకరం ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడిపూడిలో టీడీపీ నాయకుడు నామా కొండబాబు ఆధ్వర్యంలో సిద్దన రాధాకృష్ణ, తిరుమలశెట్టి సత్యనా రాయణ తదితర నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదేవరపేటలో కొఠారు వెంకట్రావు ఆధ్వర్యంలో షైనం గంగరాజు, కవల రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలకపల్లిలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు. మద్దిపాటి ప్రకాశం, చెరుకూరి వెంకట్రావు పాల్గొన్నారు. అన్నదేవరపేట యువగళం ఆధ్వర్యం లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీలోని సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, తొండెపు భరత్‌కుమార్, కూచిపూడి నరేంద్ర, సూర్యతేజ, పేరూరిరమణ, బంగారుబాబు, సత్తిబాబు శివ, రాజు, అచ్చియ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పార్టీ ముందుకు
● మాజీ ఎమ్మెల్యే శేషారావు

నిడదవోలు: బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అభివృద్ధికి టీడీపీ ఆవిర్భవించి ందని టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలో పలుచోట్ల ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించా రు. అనంతరం పట్టణంలోని నందిని ఆడిటోరియంలో జరిగిన వేడుకలలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూడు, గూడు, గుడ్డ పేదలకు అందించాలనే లక్ష్యంతో అన్న నందమూరి తారకరామారావు టీడీపీ పార్టీ స్థాపించారని అన్నారు. నేటికీ సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగానే టీడీపీ ముందుకు సాగుతుందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు కార్యకర్తలను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు, బైపే రాజేశ్వరరావు, తన్నీడిబోసు పాల్గొన్నారు.

ఆదరణ అంధుల ఆశ్రమంలో అన్నదానం
కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) కొవ్వూరు మండలం దొమ్మేరులోని ఆదరణ అంధుల ఆశ్రమంలో పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి యాళ్ల నరసింహరావు విద్యార్థులకు అన్నదానం చేశారు. అమెరికాలో ఉంటున్న నరసింహరావు కుమార్తె గారపాటి ఓంకార్, నాగదేవిలు ఆశ్రమంలోని ఇద్దరు విద్యార్థులను చదివిస్తున్నారు. ఆశ్రమ నిర్వాహకులు అక్కాబత్తుల జాన్, యాళ్ళ వెంకటరెడ్డి, పద్మావతి, వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి నిధులు మంజూరుచేయాలని పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి
● ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కోరిన ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, మార్చి29 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం కారణంగా అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చే తాగునీటి ఎద్దడిలేకుండా చూడాలని ఏలూరుజిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. ఏలూరుజిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీని కలి సి జ్ఞాపిక అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అంతర్భాగమైన గోపాలపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిలేకుండా జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. సీసీరోడ్లు, డ్రైన్లు, నిర్మాణానికి నిధులు మంజూరుచేసి గోపాలపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మట్టి ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్

దేవరపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం. శ్రీనివాస్ హెచ్చరించారు. దేవరపల్లి మండ లం యర్నగూడెం పోలవరం గట్టును యర్నగూడెం గ్రామానికి చెందిన వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వి ట్రాక్టర్లపై తర లించటంతో శనివారంరాత్రి కృష్ణంపాలెం గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రాంతానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు చేరుకుని అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ని, మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌వద్ద అప్పగించారు. దీనిపై ఇరిగేషన్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఏవిధమైన పర్మిషన్ లేకుండా మట్టి తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నందమూరు ఆలయంలో చోరీ
● హుండీలో నగదు, ఆభరణాలు అపహరణ


వివరాలు సేకరిస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీహరిరావు

కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం నందమూరు గ్రామదేవత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారి గ్రామోత్సవం ఏర్పాట్లు నిమిత్తం ఆలయానికి వెళ్లిన గ్రా మస్తులు చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ఆలయ హుండీ పగులగొట్టి అందులో ఉన్న నగదు, అమ్మవారి వెండి ఆభరణాలు దొంగిలించుకుపోయినట్లు ఎస్ఐకు తెలిపారు.

పీ4 కార్యక్రమానికి 36 మంది ఎంపిక
గోపాలపురం, మార్చి29 (ఆంధ్రజ్యోతి) రేపు అమరావతిలోని సచివాలయ సమీపంలో జరుగనున్న పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలం నుంచి 36 మందిని పంపించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో రైతు విభాగంనుంచి ఒకరు, మహిళా విభాగం నుంచి ఒకరు, యువజన విభాగం నుంచి ఒకరు, గ్రామస్తుల నుంచి విద్యావంతులైన వారిని ఒక్కొక్కరిని కలిపి గ్రామానికి నలుగురు చొప్పున 36 మందిని పంపిస్తున్నామన్నారు. ఉదయం 10గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి బస్సు బయలుదేరనుందన్నారు. ఎంపికైనవారు సకాలంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.


కొవ్వూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్


చాగల్లు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


దేవరపల్లిలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న గ్రామ టీడీపీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం


నల్లజర్లలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నిడదవోలులో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


నిడదవోలులో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేద మధ్య తరగతి అనారోగ్యవంతులైన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఒక వరమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఒక్క నిడదవోలు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.29,50,630 చెక్కులు అందిస్తున్నామని ప్రజలకు మంచి చేసే ప్రభుత్వమని అన్నారు. లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

'పంటలకు ప్రకృతి వ్యవసాయ కషాయాలు అందించాలి'


ఉత్తమ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

పెరవలి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పంటలకు ప్రకృతి వ్యవసాయ కషాయాలు ఉపయోగిస్తే భూమి గాలి, నీరు కలుషితం కాకుండా కాపాడవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖఅధికారి మాధవరావు పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గం 2025లో ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్ వర్క్‌షాపు తీపర్రులో శనివారం జరిగింది. నియోజకవర్గంలో మూడు మండలాల్లో జరిగిన రైతు సాధికారిక సంస్థ ప్రకృతి వ్యవసాయం వ్యవసాయశాఖ సర్ప్ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ నేల ఆరోగ్యంగా ఉంటే మనందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్ ఉద్దేశంపై జిల్లా వ్యవసాయాధికారి శేషారావు వివరించారు. నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన పలువురు ఉత్తమ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ పీఎం వల్లి, ఏడీఏ చంద్రశేఖర్, ఏపీఎం రామకృష్ణ, వ్యవసాయం సిబ్బంది కృపావతి, రామకృష్ణ, హరీష్, మానస పాల్గొన్నారు.

ముస్లింలకు డ్రై ఫ్రూట్స్ దుప్పట్లు పంపిణీ


ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

నిడదవోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు ఎంతో విలువైనవని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలో పెద్దమసీదులో బీజేపీ నాయకుడు రంగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పేద ముస్లింలకు డ్రై ఫ్రూట్స్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడు తూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్ర మా సమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్. బొమ్మల దత్తు, మోర్త బాల వినోద్ సాయికుమార్, చామంతి భీమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి'
దేవరపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పగడాల ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని దేవరపల్లి మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్లపాటి డేవిడ్‌రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను అరికట్టాలన్నారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద మానవ హారం నిర్వహించారు. పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు యోహాన్, ఏసురత్నం, సకినాల బాబు, రోషన్‌కుమార్, జాన్‌విక్టర్‌పాల్, ఆనంద్‌కుమార్, పిట్టా డేవిడ్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నిడదవోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహబూబ్



నిడదవోలు, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలు పట్టణంలో బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికలలో 2025-26 సంవత్సరానికి అధ్యక్షుడిగా మహమ్మద్ మహబూబ్ ఎన్నికయ్యారు. చీలి విజయ్‌కుమార్‌పై 19ఓట్ల మెజార్టీతో మహబూబ్ గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా డేగపాటి మహేష్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఉజ్జిన సత్యప్ర సన్న, జాయింట్ సెక్రటరీగా సతీష్‌కుమార్, కల్చరల్ సెక్రటరీగా గంగాధర్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు ఎన్నికైనట్లు బార్ అసోసియే షన్ తెలిపింది.

లారీ ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులు

కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడినట్లు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన చౌటిపల్లి నాగేంద్రబాబు, కామిశెట్టి గణేష్, పసుపులేటి మధుసూదనరావులు చినవాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికివెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మండలంలోని కుమారదేవం చేరుకునేసరికి అతివేగంగా వచ్చిన లారీ రోడ్డు ప్రక్కగా నిల్చున్న మారిశెట్టి సత్యనారాయణను ఢీకొని ఎడమపక్కగా వెళుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమారదేవంనకు చెందిన మారిశెట్టి సత్యనారాయణ చేతికి, బైక్ నడుపుతున్న కామిశెట్టి గణేష్‌కు కాలు విరిగింది. చౌటిపల్లి నాగేంద్రబాబు, పసుపులేటి మదుసూదనరావులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేంద్రబాబు అందించిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.


ప్రమాదానికి కారణమైన లారీ

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలి
● సివిల్ సప్లై డీఎం రాధిక


సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లై డీఎం రాధిక

దేవరపల్లి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్ఎస్‌కే సిబ్బందిపై ఉందని సివిల్ సప్లై డీఎం డి.రాధిక అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో ధాన్యం కొనుగోలుపై సీఎస్ డీటీలు, వీఏఏలు, సీఎస్‌సీ ఎస్‌లు ఎంఈవోలకు దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాలకు చెందిన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఏఎస్‌వో నాగాంజనేయులు, గన్నీబాగ్స్ ఆన్‌లైన్‌లో ఎన్ని వచ్చాయో తెలియజేయాలని టెక్నికల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకపోవడం వలన లాగిన్ అయినట్లు కనిపించటంలేదని పలువురు నుంచి ఆరోపణలు వస్తున్నందున గన్నీస్ ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. డీసీవో జగన్నాధరెడ్డి మాట్లాడుతూ పీఎస్‌సీ ఎస్‌లకు అమౌంట్ త్వరగా రిలీజ్ అయ్యేలా చూస్తామ న్నారు. రబీ సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేయాల్సిందిగా కోరారు. ఏడీఏ జయరామలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులకు రక్షణ చట్టం పోక్సో


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి అనూరాధ

కొవ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగకుండా పోక్సో చట్టాన్ని తీసుకువచ్చినట్లు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దొమ్మేరు గ్రామ సచివాలయంలో సర్పంచ్ తానేటి కుమారి అధ్యక్షతన పోక్సో చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ మాట్లాడుతూ పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలకు మంచి చెడు స్పర్శలపై అవగాహన కలిపించాలన్నారు. చిన్నారుల పట్ల ఎవరైనా అసభకరంగా ప్రవర్తించినట్లయితే వెంటనే తల్లికి గాని, దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై.చలపతి, వై. ప్రకాష్, వి.నంద, పి.హరీష్, డి.రవికుమార్, డి.వెంకటరాజు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృధికి కృష్ణ మిల్క్ యూనియన్ కృషి
నల్లజర్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే ధ్యేయంగా కృష్ణ మిల్క్ యూనియన్ పనిచేస్తుందని ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా కృష్ణ మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరరావు అన్నారు. శనివారం నల్లజర్లలో సంస్థ కార్యాలయంలో స్థానిక విలేఖర్ల సమావేశం నిర్వహించి డివిడెంట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చైర్మన్ చలసాని అంజనేయులు తమ పాలకవర్గంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 3వ విడత(డిసెంబరు నుంచి మార్చి వరకు)18కోట్లు డివిడెంట్ పాడి రైతులకు ప్రకటించిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు 3కోట్లు డివిడెంట్ అందనున్నట్లు పేర్కొన్నారు. 10వెన్నశాతం లీటర్ పాలకు రూ.82లు, బోనస్ 10శాతం కలిపి మొత్తం లీటరుకు రూ.90చెల్లిస్తుందన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్‌కు పాలు పోసే రైతుల ఇంట్లో పెళ్లి వేడుకలకు రూ.20వేలు, ప్రతి 4నెలలకు బోనస్ పంపిణీ, సబ్సిడీపై పశువుల దాణా, క్షీరా బంధు, సెమెన్ సేవలు, పశువైద్య సేవలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేసున్నున్నట్లు చెప్పారు. మేనేజర్ మూర్తి, పాల ఉత్పత్తిదారుల అసోషియే షన్ అధ్యక్షులు యలమాటి ఆనంద్, నందమూరి రామకృష్ణ, పెండ్యాల వీరాఘవులు, అల్లూరి శ్రీనివాసరావు, మద్దిపాటి దుర్గరాజు, పెండ్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిర్మూలించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



నల్లజర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో పెనవేసుకున్న మూఢనమ్మకాలను నిర్మూలించే దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించే ందుకు విద్యా సంస్థలు, ఉపాధ్యాయులు ముందుగా రావాలని సంఘమిత్ర విద్యాసంస్థ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం తమ పాఠశాలలో హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందచేత మెగా మేజిక్ షో నిర్వహించి మూఢనమ్మకాలు, కనికట్టు వంటి అపోహలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి వాటి వెనుక దాగిన నిజాలను విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మక తను ప్రోత్సహించే దిశగా మేజిక్ షో అలరించింది.